## క్లుప్తంగా

### మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు


మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు

**దెందులూరు:** రానున్న విద్యా సంవత్సరానికి దెందులూరు మండలానికి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 15, 025 వర్క్ టెస్ట్ పుస్తకాలు మంజూరుకు బుక్ పాయింట్ సెంటర్‌కు వచ్చాయని దెందులూరు మండల విద్యాశాఖ అధికారిని అన్నమ్మ అన్నారు. మంగళవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో బుక్ పాయింట్ సెంటరును ఆమె పరిశీలించారు. త్వరితగతిన అన్ని పాఠశాలకు వర్కు టెస్టు పుస్తకాలు చేరేలా పాఠశాలల హెచ్ఎంలతో సమన్వయం చేసుకోవడం జరుగుతుందన్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ప్రధానోపాధ్యాయులు సంయుక్తంగా సమన్వయంతో పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు. పంపిణీలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

### పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సునీల్ రాజశేఖర్

**దెందులూరు:** పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని పెదపాడు సీడీపీఓ డాక్టర్ సునీల్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం ఐసీడీఎస్ సోమవరప్పాడు సెక్టార్ సూపర్‌వైజర్ డి పద్మభూషణం ఆధ్వర్యంలో జోగన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఆయన కిషోర్ బాలికలకు అవగాహన కల్పించారు. చిన్నారులు, కిషోర్ బాలికలతోపాటు ప్రతి ఒక్కరికి బాలల హక్కులు ఫోక్సో యాక్ట్‌పై అవగాహన విస్తృతంగా కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం స్త్రీ శిశు సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కిషోర్ బాలికలు రక్తహీనత లేకుండా స్వయంగా బాధ్యతలు తీసుకోవాలని తల్లిదండ్రులు అంగన్‌వాడీ సిబ్బంది మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

### కోడూరికి ఘన నివాళి


గణపవరంలో కోడూరి వెంకటేశ్వర్లు చిత్రపటం వద్దనివాళులర్పిస్తున్న అఖిలపక్ష నేతలు

**గణపవరం:** స్వాతంత్ర్య సమరయోధుడు, తాలూక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోడూరి వెంకటేశ్వర్లు ఈ ప్రాంతానికి అందించిన సేవలు మరువలేనివని, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాదేటి సురేష్ అన్నారు. మంగళవారం గణపవరంలో కోడూరి వెంకటేశ్వర్లు 112వ జయంతి గణపవరం త్యాగరాజు కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోడూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అఖిలభారత హ్యాండ్‌లూమ్స్ మాజీ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు, బీజేపీ రాష్ట్ర కమిటి సభ్యుడు కూనిరెడ్డి సోమేశ్వరరావు, జిల్లా బీజేపీ కోశాధికారి కోడూరి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

### నాటు సారా విక్రయిస్తే చర్యలు


దెందులూరు ఎస్ఐ శివాజీ

**దెందులూరు:** నాటు సారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఆర్ శివాజీ తెలిపారు. మంగళవారం దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మండలంలో ఏ గ్రామ శివారు ప్రాంతంలో ఎక్కడైనా నాటుసారా తయారు చేసిన రవాణా చేసిన చర్యలు తప్పవన్నారు. మేధావులు ఉపాధ్యాయులు ఎన్‌జీవోలు స్వచ్ఛంద సంస్థలు నాటు సారా నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ప్రజల ఆరోగ్యం అభివృద్ధి జీవన విధానం దెబ్బతీసే విధంగా ఉన్న నాటు సారా తయారీ నిర్మూలనకు వ్యతిరేకంగా ఎవరైనా పనిచేస్తే విచారణ అనంతరం వారిపై పీడీయాక్ట్ పెట్టడం జరుగుతుందన్నారు.

### నేడు ఏలూరులో ఒకరోజు శిష్యత్వపు శిక్షణ సమావేశం



**దెందులూరు:** ఏలూరు ఎస్ఆర్‌కో ప్రేయర్ హాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఒకరోజు శిష్యత్వపు శిక్షణ సమావేశం జరుగుతుందని పాస్టర్ ఎం స్వరూప్ రాజ్ అన్నారు. సోమవారం దెందులూరులో ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యఅతిథిగా జాన్ సుందర్ రావు విచ్చేస్తున్నారని భక్తులు ఒకరోజు శిష్యత్వపు శిక్షణ సమావేశానికి హాజరై దేవుని దీవెనలు పొందాలని ఆయన కోరారు. వారితో పాటు సంఘ ముఖ్యులు ప్రసాద్ సౌభాగ్యం ఉన్నారు.

# నీడ కరువాయె

- కానరాని బస్‌షెల్టర్లు
- అవస్థలు ఎదుర్కొంటున్న ప్రయాణికులు

**దెందులూరు:** మండల పరిధిలో దెందులూరులో నుంచి సుమారు 21కిలోమీటర్ల జాతీయ రహదారి విస్తరించింది. ఏలూరు వెళ్లేందుకు జాతీయ రహదారిపై చేరుకొని బస్ కోసం వేచి ఉండాలి. అయితే ప్రధాన కూడళ్లలో షెల్టర్లు లేకపోవడంతో ఎండకు, వానకు ఆరుబయటే వేచి ఉండే పరిస్థితి నెలకొని ఉంది. ఒకటి రెండు షెల్టర్లు ఉన్నప్పటికీ అవి శిథిలావస్థకు చేరి వినియోగించడానికి పనికి రాకుండా పోయాయి. దెందులూరు, పెదవేగి గ్రామాల ప్రయాణికుల కోసం గతంలో బస్ షెల్టర్లు నిర్మించారు. అయితే అవి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రయాణికులకు బస్ షెల్టర్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండలంలోని ప్రధాన కూడలైన దెందులూరుకు పెదవేగి, పెదపాడు, భీమడోలు తదితర గ్రామాల ప్రజలు వస్తుంటారు. అయినా మండల కేంద్రమైన దెందులూరులో నిత్యం వందలాది మంది వివిధ పనుల కోసం వస్తుపోతుంటారు. కానీ బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు దుకాణాల వద్ద బస్‌ల కోసం ఎదురుచూడాల్సి పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఎండలో నిరీక్షణ తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి అవసరమైన చోట్ల షెటర్లు నిర్మించి ప్రయాణికుల కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

**బస్టాండ్‌కి నోచుకోని దెందులూరు**

మండల నియోజకవర్గ ముఖ్యమైన దెందులూరు బస్టాండ్‌కు నోచుకోలేకుండా పోయింది. దెందులూరు నియోజకవర్గం నుంచి ఎంతో మంది ఎమ్మెల్యేలు, మంత్రులుగా ఎన్నికైనా బస్టాండ్ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.


నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్

> **షెల్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి**
>
> 
>
> ప్రధాన కూడళ్లలో ప్రయాణికుల అవస్థలు తప్పేలా నాయకులు, అధికారులు షెల్టర్లు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. వేసవి కాలంలో ఎండలో, వర్షాకాలంలో వానలో ఉండి బస్‌ల కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. ప్రతి కూడలికి నిత్యం వందలాది మంది వస్తూ బస్‌ల కోసం అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి బస్ షెల్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.
>
> – సనివల్లి రామకృష్ణ (విష్ణు), సర్పంచ్ సానిగూడెం

### ప్రాణాంతక వ్యాధులపై అవగాహన


గుండుగొలను సంత మార్కెట్‌లో వీధి నాటిక ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

**భీమడోలు:** ఎయిడ్స్ మహమ్మారిని జిల్లా నుంచి తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారుల బృందం కోరింది. గుండుగొలను సంతమార్కెట్ వద్ద మంగళవారం ఎయిడ్స్, హెచ్ఐవీ కుష్ఠు వ్యాధులపై అవగాహన కల్పించారు. రక్తదానంపై వీధి నాటిక ద్వారా అవగాహన కల్పించారు. కళాకారులు ఎం.తిరుపతి కుమార్, వి.సుబ్బారావు, ఎం.శ్రీదివ్య, వి.వాణి, వి.ప్రసాద్, ఎం.కుమార్ పలు అంశాలపై వీధి నాటికను వేశారు. వ్యాధి గుర్తింపు, మందులు, చికిత్స వంటి విషయాలపై వివరించారు.

## వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర సంఘం నాయకుడు జయసూర్య

**గణపవరం:** వేసవి తీవ్రత దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని, తరచూ నీరు తాగాలని పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర సంఘం గౌరవ సలహాదారు నిడమర్తి జయసూర్య అన్నారు. మంగళవారం గణపవరం లయన్స్‌క్లబ్ భవనంలో మండల పీఎంపీ అసోసియేషన్ సమావేశం మండల శాఖ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న జయసూర్య మాట్లాడుతూ ఎండలో బయటకు వెళ్లినప్పుడు తలతిరగడం, వాంతులు ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వడదెబ్బగా గుర్తించాలని, త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చి చల్లనినీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరాన్ని బాగా తుడవాలని శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరేవరకూ ఇలా చేయాలని సూచించారు. అపస్మారకస్థితిలో ఉంటే నీరు తాగించకూడదని, త్వరగా సమీప ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పీఎంపీ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, గణపవరం మండల సంఘం నాయకులు పాల్గొన్నారు. ముందుగా ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన జవానులకు నివాళులర్పించారు.

## ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు


భీమడోలులో దేశ భక్తి గేయాలాపన చేస్తున్న దృశ్యం


పెదపాడు శాఖా గ్రంథాలయంలో మాట్లాడుతున్న వక్తలు

**భీమడోలు:** దేశభక్తిని చాటే గేయాలాపన పట్ల విద్యార్థి దశ నుంచి మక్కువను పెంచుకోవాలని జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరం మంగళవారం ఉత్సాహంగా సాగింది. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతుల్లో కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్‌లు పాల్గొని నీతి కథలు, దేశ భక్తి గేయాలాపనలపై ఆసక్తిని పెంచేలా వారికి శిక్షణ అందించారు. గ్రంథపాలకుడు గణితం, జీకే అంశాలపై మెలకువలను తెలిపారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో చిన్నారులంతా సామూహిక పుస్తక పఠనం చేసి, సమీక్షలు రాశారు. గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో చిన్నారులు పుస్తకం, అమరుల జీవిత చరిత్రపై అవగాహన కల్పించారు.

**గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి**

**పెదపాడు:** గ్రంథాలయాలు విజ్ఞానాన్ని విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని పెదపాడు గ్రంథపాలకుడు దుగ్గిపోగు జాన్‌బాబు తెలిపారు. పెదపాడు శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన తరగుతులు నిర్వహించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులకు గుడిపాడు మహిళబూత్ పోలీసు పిట్టా దివ్య ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. బాలికలు విద్యార్థి దశ నుంచే మంచి నడవడిక నేర్చుకోవాలన్నారు. బాలికలను వేధించిన వారిని మానసికంగా మాటలు ఆడిన చట్టాలు చాలా సీరియస్‌గా పరిగణింపబడతాయని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకుని మంచి ర్యాంకులు సాధించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో 34 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

**ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం**

**దెందులూరు :** పోతునూరు గ్రంథాలయంలో మంగళవారం పాఠశాల విద్యార్థులకు జూనియర్ సీనియర్ విభాగాల్లో ఆటలు పోటీలను గ్రంథాలయ అధికారి రాంబాబు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడుతున్నాయని విద్యార్థులు సైతం ఆసక్తిగా క్రమం తప్పకుండా శిక్షణ తరగతులలో పాల్గొంటున్నారన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక శిక్షణ తరగతుల్లో ఆటల పోటీలను కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు మట్టి పరీక్షలు చేయించుకోవాలి


ఉంగుటూరులో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

**ఉంగుటూరు:** ప్రతి రైతూ వారి వ్యవసాయ క్షేత్రంలోని మట్టి నమూనాలను పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాష, భీమడోలు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ పి.ఉషరాజకుమార్ అన్నారు. మంగళవారం ఉంగుటూరు గ్రామంలో మట్టి నమూనా పరీక్షల నిమిత్తం రైతుల పొలాల్లో మట్టి నమూనాలు తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025–26 సంవత్సరంలో భాగంగా ఉంగుటూరు మండలానికి 1600 మట్టి నమూనాలు టార్గెట్ ఇచ్చామని, మండలంలోని అన్ని గ్రామాల్లో మట్టి నమూనాల సేకరించి నెలల స్వభావం, వాటిలో ఉన్న పోషకాలు విలువలు తెలుసుకునే విధంగా మట్టి నమూనా పరీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డాక్టర్ ఎంఎస్ ప్రవీణ్ కుమార్, రైతు సేవ కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


గుండుగొలనులో బాల వికాసం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి

**భీమడోలు:** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, గ్రామస్థాయిలో బాల్య వివాహాలు జరిగేతే సమాచారం అందించాలని భీమడోలు ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. గుండుగొలను, పూళ్ల, కురెళ్లగూడెం, కోడూరుపాడు, దుద్దేపూడి గ్రామాల్లో బాల వికాసం 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన ర్యాలీలు చేశారు. బాల్య వివాహాల వల్ల అనర్థాలు, బాలల హక్కులు, వాటి రక్షణ, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, వ్యక్తిగత పరిశుభ్రత, పోష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గుండుగొలను నెం.23 అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త బి.రాజమణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం.కవిత, సూర్యహాస్‌లు మాట్లాడుతూ మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు గ్రామస్థాయిలో ప్రతి మంగళవారం, శుక్రవారాల్లో బాల వికాసం కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో మహిళా కానిస్టేబుళ్లు భారతి, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

### నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పెదవేగి :** మండలంలోని పెదవేగి సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కేవీ రామసింగవరం సబ్ స్టేషన్లో క్రొత్త టవర్ లైన్ పనుల నిమిత్తం రెండు రోజులు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేడ్కర్ చెప్పారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈనెల 14, 15 తేదీల్ల బుధ, గురువారాల్లో ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 03 :00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడుతుందని, అందువల్ల రామసింగవరం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న రామసింగవరం, తాళ్ల గోకవరం, ఆశన్న గూడెం పరిసర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. ఈ మేరకు వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం


అన్నదానం వితరణ దాతలను ఆశీర్వదిస్తున్న అభయాంజనేయస్వామి ఆలయ అర్చకుడు

**పెదపాడు:** మండలంలోని అప్పనవీడులోని అభయాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం పురస్కరించుకుని 200 మందికి అన్నదానం నిర్వహించారు. ఈఅన్నదానానికి హనుమాన్ జంక్షన్‌కు చెందిన తవ్వా పూర్ణ చంద్రరావు దంపతులు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

**అభయాంజనేయస్వామి జయంతి ఉత్సవ పోస్టరును విడుదల చేసిన ఎమ్మెల్యే**

అప్పనవీడులోని అభయాంజనేయస్వామి వారి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గోడపత్రికలను, కరపత్రాలను దెందులూరు ఎమ్మెల్యే ప్రభాకర్ మంగళవారం ఆవిష్కరించారు.

### ఉరి వేసుకుని వ్యక్తి మృతి

**ఏలూరు టౌన్:** పెదవేగి మండలం అంకన్నగూడెంకు చెందిన పల్లెపాముల శ్రీను (34) తీవ్ర మనస్థాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు జీజీహెచ్ ఔట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనుకు భార్య, పిల్లలు ఉన్నారు. శ్రీను కొంతకాలంగా మద్యానికి బానిసగా మారటంతో భార్య వెంకటలక్ష్మి కొద్దిరోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంట్లో శ్రీను ఒక్కడే ఉంటున్నాడు. ఒంటరితనాన్ని భరించలేని శ్రీను తీవ్ర మానసిక వేదనతో మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అతడ్ని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పెదవేగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వైభవంగా సువర్ణేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు


స్వామివారికి పూజలు చేస్తున్న దంపతులు

**గణపవరం:** స్థానిక సువర్ణేశ్వరస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈఉత్సవాలు ఈనెల 14వతేదీ బుధవారం వరకూ జరుగుతాయని ఆలయ ఈఓ శోభనాద్రి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు చెరుకూరి రాకేష్, చెరుకూరి మణిబాబు, విశిష్ట ప్రద్యుమ్నన్‌ల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్చరణల మధ్య కల్యాణం చేశారు. కల్యాణబ్రహ్మగా కైతేపల్లి బాలసుబ్రహ్మణ్యం వ్యవహరించి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో కై తేపల్లి నాగ వెంకట సీతారామారావు, శిరీష దంపతులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

**దెందులూరు:** విపత్తులు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయం నుంచి రక్షించుకునేలా ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పరిశ్రమల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ త్రినాథరావు, ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ దీపక్ కుమార్, దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. దెందులూరు బత్తిన సోమరాజు రైస్ మిల్ ఆవరణలో పైప్ లైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (పిల్) సీనియర్ జనరల్ మేనేజర్ ఎస్ ఏ ఖాన్ ఆధ్వర్యంలో పొల్యూషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కళ్యాణి, గోపన్నపాలెం వైద్యాధికారి డాక్టర్ రాకేష్, పిల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో మంగళవారం గ్యాస్ పైప్ లైన్ లీకేజీ మార్క్ డ్రిల్ నిర్వహించారు. విపత్తులు జరిగినప్పుడు ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఎంతకి అత్యవసర పరిస్థితులైన ప్రజల సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సభ్యులు 25 మంది మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు సూచనలు సలహాలను తెలిపారు. తుఫాన్లు వరదలు విపత్తులను ఎదుర్కోవడానికి అంబులెన్సు పారామెడికల్ సిబ్బంది ఎన్సిసి వాలంటీర్లు ఫైర్ ఇంజన్లు అగ్నిమాపక పరికరాలతో పాటు పోలీస్ రెవెన్యూ ఫైర్ రాష్ట్ర విపత్తు నివారణ సిబ్బంది సిద్ధంగా ఉన్నానన్నారు. మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రమణ, గోపన్న పాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి రాకేష్, దెందులూరు గ్రామ సర్పంచ్ తోట ఏసమ్మ, మాక్ డ్రిల్‌కి సంబంధించి పలు సూచనలు చేశారు.

### జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలి

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004వ సంవత్సరం మధ్య వరకు ఉద్యోగం పొందిన సిబ్బందికి జీపీఎఫ్ సౌకర్యం కలింపంచాలని విద్యుత్ జీపీఎఫ్ సధన సమితి నాయకులు డిమాండ్ చేశారు.

## నీతివంతమైన జీవితం అలవరుచుకోవాలి

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** నీతి కథల్లో నీతిని అర్థం చేసుకుని తమ జీవితాలను కూడా నీతివంతంగా మలుచుకోవాలని గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా గ్రంథాలయ సిబ్బంది ఆవు – పులి నీతి కథలు బోధిస్తు కథల్లోని నీతిని విద్యార్థులతో చెప్పించారు. ఎలక్ట్రికల్ ఇంజనీర్ వి.బాలునాయక్ పాల్గొని నేటీ బాలలే రేపటి పౌరులు, పుస్తకాలే నేస్తాలని వివరించారు. రిసోర్స్ పర్సన్ డి.శ్రీవల్లి విద్యార్థులకు యోగా తరగతులు చెప్పి, సరదా ఫన్నీ గేమ్స్ ఆడించారు. పి.శంకర్ డ్రాయింగ్ తరగతులను కొనసాగించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు వీటీ సందీప్ కుమార్, ఎండీ అస్లాం పాషా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విపత్తులపై మాక్ డ్రిల్


మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం


మాక్ డ్రిల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

**ఏలూరు(మెట్రో):** ప్రకృతి వైపరిత్యాలు, అగ్నిప్రమాదాలు, వరదలు వంటి సంక్షోభాల సమయంలో ప్రజలను అప్రమత్తంచేందుకు మాక్ డ్రిల్ ఉపయోగపడుతుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. మంగళవారం ఏలూరు కలెక్టరేట్‌లో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. కలెక్టరేట్ పై అంతస్తులో అగ్నిప్రమాదం సంభవించింది మొదలు నిచ్చెన ఆసరాగా భవనంపైకి విపత్తు స్పందన సిబ్బంది చేరుకుని ప్రమాదంలో చిక్కుకున్న వారిని కిందికి తీసుకొచ్చి తక్షణం వైద్య సహాయం అందించేందుకు 108 వాహనాలు ద్వారా ఆసుపత్రికి తరలించడం వంటి అంశాలను వివరించారు. వీటన్నింటిని కలెక్టర్ వెట్రిసెల్వి స్వయంగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ సీహెచ్ రత్నబాబు, త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజు, డీసీహెచ్ఎస్ పాల్ సతీష్ కుమార్, ఎన్‌టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ రాజీవ్, సెట్ వెల్ సీఈఓ ప్రభాకర్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్‌వీ నాగరాణి, కలెక్టరేట్ ఏఓ నాంచారయ్య, తహసీల్దారు జి.శేషగిరి, కలెక్టరేట్ సిబ్బంది, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన విద్యుత్ అందించాలి

**ఏలూరు(మెట్రో):** జిల్లాలోని వ్యవసాయ, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం నిర్వహించిన జిల్లా విద్యుత్ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. పునరుద్ధరించబడు పంపిణీ రంగ పథకం (ఆర్‌డీఎస్) రూ.176 కోట్లతో వ్యవసాయ ఫీడర్ల నుంచి వ్యవసాయేతర సర్వీసులను వేరుచేసే ఫీడర్ల విభజన కార్యక్రమాలు, రూ.66.51 కోట్లతో ఓవర్ లోడ్ ఫీడర్ల విభజన పనులను డిసెంబర్‌లోగా పూర్తిచేసేందుకు నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలపై 1912 టోల్ ఫ్రీ అందే ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. వ్యవసాయానికి 9 గంటలపాటు నిరంతరాయంగా, అదేవిధంగా గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గానికి కేటాయించిన పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు.

### ముగిసిన పుష్పయాగ మహోత్సవాలు

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** స్థానిక బావిశెట్టి వారిపేట శ్రీ కనకదుర్గాంబ ఆలయంలో అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవ, పుష్పయాగ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం పూజలు, హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అర్చకుడు యడవల్లిత శ్రీహరి శర్మ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.